
# మంచివాడే, మరి!




తాలూకా ఆఫీసు కలకల్లాడుతూ ఉంది.

గుమాస్తా లందరూ గుట్టలుగా పేరుకు పోయిన ఫైళ్ళ సందులో, తలలు దూర్చి హైరాన పడిపోతున్నారు—పక్క చూపులతో మిగత టేబిలు దగ్గర నిలబడిన పార్టీలను చూస్తూ, తమ టేబిలు దగ్గర ఉన్న పార్టీలకన్న ఇతర గుమాస్తాల పార్టీలే మోతుబరులుగా (జేబుల మోతబరువులు ఎక్కువగా ఉన్న వాడిలా ) ఊహించుకొంటూ.

తహసీల్దారు కాంపు వెళ్ళడానికి సిద్ధపడుతున్నాడు' ఏ పూళ్లో, ఎవరి పుట్టి మునుగుతుందో అంచనా వేస్తున్నాడు డెప్యూటీ. డవాలా బంట్రోతు పంచ దార పెర్మిట్లు, అర్జీలూ, స్టూడెంట్ల కాస్టు సర్టిఫికేట్లూ గబగబ కట్టకు చేస్తున్నాడు—అయ్యగారు వెళ్ళిపోకముందే సంతకాలు పెట్టించి, పాపం! వాళ్ళందరికీ ఉపకారం చేయాలనే సదుద్దేశంతో. వాళ్ళిస్తున్న అర్జీలతో ఎడమ చేయి నిండిపోగా, నిండని కుడి చేయి గుప్పిటవంక కోపంగా చూస్తూ రుస రుస లాడుతున్నాడు.

అది గమనించిన మూల టేబిలు ఎ్రతీ క్లర్కు మూర్తి ముసి ముసిగా నవ్వుకొంటున్నాడు. ఈ రకం మనుష్యులంటే మూర్తికి మంట. ఈ వాతావరణానికి ఎడ్జస్టు కాలేకపోతున్నాడు. ఎంత రాజీ పడదామన్నా వెధవ కాన్షన్ సెన్ ఒప్పుకోవడం లేదు. ఇక తన పద్ధతి మారదు. తన అంతరాత్మకు ద్రోహం చేసుకోలేడు. అంతే.

డవాలా బంట్రోతు మూర్తి దగ్గరికి వచ్చి, "మీకు ఫోనొచ్చింది, సార్!" అన్నాడు. వడివడిగా వెళ్ళిన మూర్తి, ఫోనులోని విషయాన్ని విని ప్రాన్పడిపోయాడు. కాళ్ళూ, చేతులూ ఆడ లేదు. ఒడలంతా చమటపట్టింది. గుండె విపరీత మైన వేగంతో స్పందించ సాగింది. నిరాకరిస్తున్న నాడీమండలాన్ని స్వాధీనపరుచుకొని, తన అనుంగు

ఇందిరా నారాయణ

మిత్రుడైన రావు టేబిలు దగ్గరికి వచ్చి నిల బడ్డాడు.

"ఏమిట్రా, ఎక్కడినుంచి ఫోను?" అడిగాడు రావు.

"ఒరేయ్ ! నాకంతా అయోమయంగా ఉందిరా. సుజాతకు సీరియస్‌గా ఉందట. ఇప్పుడే జనరల్ హాస్పిటలుకు తీసుకువెళ్ళారట. మా ఇంటి పక్క నున్న సదాశివరావు ఫోన్ చేశాడు."

"అరరే ! ఏం జరిగిందిరా?"


"ఏమోమరి ! వివరాలు చెప్పలేదు. సీరియస్‌గా ఉందని చెప్పి వెంటనే రమ్మన్నాడు. అంతే. ఉదయం నేను వచ్చేసరికి బాగానే ఉంది. మరి ఇంతలోనే ఏం జరిగిందో!"

"ఇంకా నీళ్ళు నములుతూ అలా నిలబడి పోయావేమిట్రా? డెప్యూటీతో చెప్పి ముందు నువ్వు పరుగెత్తు. నీ వెనకనే నేనూ వస్తాను" అన్నాడు రావు.

అఘమేఘాలమీద సైకిలు తొక్కుకుంటూ

వార్తలకు, వ్యాఖ్యలకు, స్వతంత్ర భావ ప్రకటనకు
అందరూ అభిమానించే దినపత్రిక
ఆంధ్రప్రభ




వెళ్ళాడు మూర్తి. కాజువాల్టీ డిపార్టుమెంటులో అడిగి, తన భార్య నుంచిన గది తెలుసుకొన్నాడు.

ప్రమాదకరమైన కేసులనుంచే ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఆ గదిలోని దృశ్యాన్ని చూడగానే శిలాప్రతిమలా నిలబడిపోయాడు మూర్తి. ఆకాశం భళ్ళున బద్దలై తన తలమీద విరుచుకు పడినట్లయింది. భూకంపం వచ్చినట్లు తాను నిలుచున్న భూమి అదిరిపోతూంది. విచ్చిన నెర్రగుండా తాను భూమిలో కూరుకు పోతున్నాడు. ఆ గదీ, హాస్పిటలూ, చరాచర జగత్తూ—అంతా గిర్రున తిరిగిపోతూంది. తనకేమీ కనుపించడం లేదు, వినిపించడం లేదు. వెర్రివాడిలా చూస్తూ, వణికిపోతూ, తూలిపోతున్న మూర్తిని సదాశివరావు గభాలున వచ్చి పట్టుకొని, అక్కడి బెంచీ మీద కూర్చోబెట్టాడు.

"మీ ఆవిడ మాట్లాడ్డంలేదని మీ అమ్మాయి ఏడుస్తూ వచ్చి చెపితే నేనూ, మా ఆవిడా వెళ్ళి చూశాం. మీ ఆవిడ ఎలుకల మందు మింగినట్టుంది. ఆ ఖాళీ పాకెట్టు కూడా తీసుకొని వచ్చి డాక్టరుకు చూపించాను. మీ పిల్లలిద్దర్నీ మా ఇంట్లో అట్టే పెట్టాను. ఈ బీభత్సమైన దృశ్యాన్ని చూసి ఆ పసివాళ్ళు తట్టుకోలేరుగదా? మీరు తిరిగి వచ్చేవరకూ భద్రంగా ఉంటారు. మరి, నేను వెడతాను. అవతల నాకు బోలెడంత పని ఉంది" అని వెళ్ళిపోయాడు సదాశివరావు.

కాస్సేపటికి తేరుకొని, సుజాత మంచం దగ్గరికి వెళ్ళి, ఆమె ముఖాన్ని పరికించాడు. పచ్చని బంగారు చాయలో ఉంతి ఆమె ముఖం నీలి రంగుకు మారిపోయింది. మూసుకొనిపోయిన కను రెప్పలు నల్లగా ఉన్నాయి. ముక్కులో జొనిపిన రబ్బరు గొట్టం ద్వారా ఆక్సిజను ఫ్లో అవుతూంది. దానికి గుర్తుగా సిలిండరుకు అమర్చిన నీటి సీసాలో బుడగలు వస్తున్నాయి. ఒకచేతి రక్తనాళంలోనికి సూది గుచ్చి సెలైను పెడుతూంది ఒక స్టాఫ్ నర్సు. మరొక నర్సు డెక్స్‌ట్రాన్ ఏట్రోపిన్ ఇంజెక్షన్లను సుజాత రెండు జబ్బలకూ పొడిచింది. మరో చేయికి కఫ్ కట్టి, బి. పి. చూస్తున్నాడు డాక్టరు.

మూర్తి హతాశుడయాడు. ఆ ఆక్సిజనుకు బదులుగా తన ఊపిరి ఇమ్మన్నా ఇస్తాడు ఆమె బ్రతుకుతుందంటే. బొట్లు బొట్లుగా పడుతున్న ఆ సెలైనుకు బదులుగా తన రక్తాన్ని—ఆఖరి బొట్టువరకూ ఇస్తాడు ఆమె జీవిస్తుందంటే.

"నా భార్య నెలాగైనా రక్షించండి, సార్!" అన్నాడు డాక్టర్ దగ్గరికి వెళ్ళి రుద్ధ కంఠంతో.

"మీరు బయటకు వెళ్ళి నిశ్శబ్దంగా కూర్చోండి. మా ప్రయత్నాలు మేం చేస్తున్నాం" అన్నాడు డాక్టరు. విషణ్ణ వదనంతో గది బయటికి వచ్చి అక్కడి బెంచీమీద కూలబడ్డాడు.

'ఏమిటీ పని, సుజా, ఎందుకు చేశావిలా? నన్నెందు కింత అన్యాయం చేస్తున్నావు?' తనలో తనే రోదించ సాగాడు మూర్తి.

'నిన్నెంతో ప్రాణప్రదంగా ప్రేమించానే! నీ తోడిదే లోకమనుకున్నానే! ఎందు కింత పని చేశావు? నీకేం లోటు చేశాను? మహారాణి లాంటి భోగ భాగ్యాలు నీ కమర్చలేక పోయాను. ఎ. సి. రూముల

తోనూ, కళ్ళు జిగేలుమనే ఫర్నిచరుతోనూ, పిలిస్తే పలికే నౌకర్లతోనూ నిండిన పాలరాతి భవనంలో నిన్ను కాపురం చేయించలేక పోయాను. కారు, బొచ్చు కుక్కలు, వజ్రాల నగలు, పట్టు చీరలు నీ కందివ్వలేక పోయాను. నిజమే. నా గుమాస్తా జీవితంలో అటువంటివన్నీ అందుకోలేని ఆకాశ హర్మ్యాలని నీకూ తెలుసు. అయినా ఉన్నంతలో నీ కే కొదువా చేయలేదు. నా హృదయంలో మహారాణిగా ప్రతిష్ఠించుకొన్నాను. నీవు కూడా ఎప్పుడూ ఏ విధమైన అసంతృప్తినీ నా ముందు వెల్లడి చేయలేదు. మరి ఇంతటి ఘాతుకం ఎందుకు చేశావు సుజా?'

నర్సు హడావిడిగా బయటికి వచ్చి, పక్క గదిలో నుండి ఏదో ఇంజెక్షను వయలు తీసుకుని తిరిగి లోనికి వెళ్ళింది. మూర్తి కూడా ఆమె వెనకనేవెళ్ళి చూశాడు. సుజాత నోటి నుండి నురుగు బయటికి వస్తూంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు భారంగా గురు గురుమనే చప్పుడు చేస్తున్నాయి. ఒక నర్సు ఆమె నోరు పెగల్చి, సన్నని రబ్బరు గొట్టాన్ని ఆమె గొంతులోనికి దూర్చి, అటూ ఇటూ కదుపుతూంది. ఆ గొట్టానికి అమర్చబడిన 'సక్షన్ ఏపరేటస్' ఆమె గొంతులోని ద్రవాన్నంతా పీల్చి వేస్తూంది.

ఆమెమంచానికి పక్కనున్న స్టూలుమీద కూర్చుని ఆమె ఫాల భాగంమీది ముంగురుల్ని సవరించాడు. 'నేను తెలియక చేసిన తప్పు లేమయినా ఉంటే క్షమించు' సుజా! నువ్వు లేనిదే నేనూ బ్రతకలేను. నేనూ నీ వెంటే వస్తాను. మన పిల్లల కోసమైనా జీవం పోసుకో' అని లోలోనే ఆక్రోశించాడు మూర్తి.

సుజాతను చూస్తున్న మూర్తి ఉలికి పడ్డాడు. ఆమె ఊపిరి నిలిచిపోయింది. గుండె భాగాన్ని స్టెత్‌తో పరీక్షించిన డాక్టరు—"సారీ!" అని బయటికి వెళ్ళి పోయాడు.

సుజాత ముఖం మీద తలను వాల్చి, "సుజా!" అంటూ ఆ గది దద్దరిల్లేలా ఆక్రందించ సాగాడు మూర్తి. అప్పుడే లోనికి వచ్చిన రావు మూర్తి పొదివి పట్టుకొని బయటికి నడిపించాడు.

● ● ●

ఇంటికి వచ్చిన మూర్తి పిల్లల్ని కౌగిలించుకొని బిగ్గరగా ఏడ్వ సాగాడు. పోస్ట్‌మన్ వచ్చి అందించిన కవరు మూర్తి కిచ్చి, "ఒరేయ్! నీకుఉత్తరం వచ్చింది. చదవరా" అన్నాడు రావు.


కాసేపటికి కళ్ళు తుడుచుకొని, కవరు చించి, లోనున్న ఉత్తరం చదవసాగాడు మూర్తి.

"శ్రీ వారికి నమస్కరిస్తూ, మీ ప్రియాతి ప్రియమైన సుజాత వ్రాయునది :

"అవును, నేను మీకు ప్రియాతి ప్రియమైనదానినే. నా యెడల మీకు ఉండే ప్రేమను శంకించలేను, తక్కువగా అంచనా వేయలేను. కాబట్టే ఈ పది సంవత్సరాలూ మీతో కాపురం చేయగలిగాను.

"ఈ సరికి నా చావును కళ్ళారా చూసే ఉంటారు. మీ ప్రణయారాధ్య దేవత పరలోక వాసి అయినందుకు పరితపిస్తూనే ఉంటారు. అందులో అనుమానం ఏమీ లేదు.

"అయినా నే నెందుకు ఆత్మహత్య చేసుకోవలసి వచ్చిందో — మీరు ఊహించ గలిగినా, లేకపోయినా — నా కనీస ధర్మంగా చెప్పకుండా ఉండలేను.




"మీరు నన్ను ప్రాణప్రదంగానే ప్రేమించారు. నేనూ మిమ్మల్ని అలాగే ప్రేమిస్తూ వచ్చాను. కాని, నా ప్రేమను శంకించారు. నా హృదయంలో మరొక పురుషుడు కూడా స్థానం సంపాదించి ఉన్నాడని మీ అనుమానం. మీకన్న ముందుగా — అంటే నా బాల్యదశ నుండీ అతడు నా హృదిలో స్థిరంగా పీటం వేశాడని మీ నిర్ణయం. అందుచేత పూలపాన్పుపై పరుండవలసిన మనం ముళ్ళ పాన్పుపై శయనిస్తూ వచ్చాము." మూర్తి ఉత్కంటగా చదవసాగాడు.

"నవనవోన్మేషమైన కోటి తీయని కోర్కెలతో —మీతో మధురమైన జీవితాన్ని పంచుకొని సాఫల్యం చెందాలని శోభనం గదిలో అడుగుపెట్టాను. అక్కడ మీరు చిత్రాతి చిత్రంగా మాట్లాడారు. మీ ప్రేమ గాథను వివరించారు. నన్ను బులిపించి, మాయ మాటలు చెప్పి, చిరుత ప్రాయంలో నేను ఆనందును ప్రేమించిన (అది మీదృష్టిలో ప్రేమే కాబట్టి) విషయాన్ని రాబట్టగలిగారు. ముందు చూపు లేకుండా, మీరిచ్చిన భరోసాన నమ్మి, మీ కది చెప్పి వేశాను."

ఉత్తరం చదువుతున్న మూర్తి అక్కడికి ఆపి ఎటో చూడసాగాడు సాలోచనగా.

అవును—ఆమె వ్రాసింది నిజమే. కాలేజీలో చదువుకొనేటప్పుడు తానూ, రాధికా పరస్పరం ప్రేమించుకొన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఒకటి కావాలని వాగ్దానాలు చేసుకొన్నారు. కాని, పరిస్థితుల ప్రాబల్యం వల్ల ఆమెను తాను వివాహం చేసుకోలేకపోయాడు. ఆమె మరొకరి సొత్తు అయిపోయింది. కాకతాళీయంగా ఆమెను ఒకసారి రైల్వే ప్లాటుఫారం మీద కలుసుకొన్నాడు. చంటి పిల్లవాడిని ఎత్తుకొని ఉంది. తానామెను సమీపించాడు.

"బాగున్నావా, రాధికా?" అడిగాడు ఆప్యాయంగా.

"బాగున్నాను, మూర్తీ! నువ్వెలా ఉన్నావు? ఏం చేస్తున్నావు? పిల్లలెందరు?" అడిగింది తనను తనివితీర చూస్తూ.

అప్పటికి తనకు పెళ్ళి కాలేదు. ఆమెతో అదే చెప్పాడు. ఆమె చాలా బాధ పడింది. అనుకొన్నవి జరగనప్పుడు రాజీపడి సర్దుకుపోవాలనీ, దుఃఖించి ప్రయోజనం లేదనీ చెప్పింది. త్వరలోనే పెళ్ళి చేసుకొని తనను మరిచిపొమ్మంది. తానలా చేయని పక్షంలో ఆమె సుఖించలేనంది. తాను నవ్వేసి ఊరుకున్నాడు. ఆమె భర్త ఆర్. అండ్ బి.లో ఎ. ఇ. అట. టికెట్టు తేవడానికి వెళ్ళాడట.

"నీ సంసారం ఎలా ఉంది, రాధి?" అడిగాడు తాను.

"బాగానే ఉంది. ఆయన చాలా మంచి వారు."

"పోనీలే నువ్వయినా సుఖంగా ఉన్నావు. అదే నాకు కావలసింది" అన్నాడు తాను. అంతలోనే తా నెక్కవలసిన ట్రెయిను కదులుతూండడం చూచి—"వస్తాను, రాధి, విష్ యూ ఆల్ ది బెస్ట్", అన్నాడు తాను.

ఆమె సజల నయనాన్ని దాచుకొందుకు పిల్లవాడిని ముద్దుపెట్టుకొంది. "ఆయనకు ట్రాన్

## నవ్వులూ-సంధ్యలూ

ఈ జీవితమనే ఆకాశంలో
సుఖ మన్నది దినము
దుఃఖ మన్నది రాత్రిము
సుఖాన్ని చూచి సంతోషంగా
నవ్వే నవ్వు తొలిసంధ్య!
దుఃఖాన్ని చూచి విషాదంగా
నవ్వే నవ్వు మలిసంధ్య!!!

- రఘువర్మ

చెప్పు, శ్రీనివాసమూర్తీ!" అంది తన కొడుకుతో. తాను వెంటనే కదులుతున్న ట్రెయిను ఎక్కేశాడు, సంభ్రమాశ్చర్యాలు నింపుకొని. అది తన పేరే! కొడుక్కు పెట్టుకొంది!

రాధిక మరొకరి భార్య అయినా, భర్త మంచి వాడయినా, సర్వసౌఖ్యాలనూ అనుభవిస్తున్నా—తనను చూచి కన్నీరు నింపుకొంది! పెళ్ళి చేసుకోమనీ, తనను మరిచి పొమ్మనీ వేడుకొంది. ఆమెలా జీవితంతో రాజీపడమంది. ఎంత చిత్రం! ఆమె తనను మరిచిపోలేదు. అలా నటిస్తూంది. అంతే. తనను మాత్రం మరిచిపొమ్మంటూంది!!

కాలం మాన్పలేని గాయం ఉండదు. తాను పమాధానపడి సుజాతను చేసుకొన్నాడు. శోభనం నాడే సుజాతకు తన ప్రేమగాథనంతా మర్మం లేకుండా చెప్పాడు. తాను రాధికను మరిచిపోగలుగుతన్నాడని నమ్మకంగా చెప్పాడు. మనుగడ సాఫీగా సాగేందుకు భార్యాభర్తల నడుమ రహస్యాలూ, దాపరికాలూ ఉండకూడదన్నారు. గతంలోని ప్రేమలూ, సంఘటనలూ అన్నీ ఒకరికి మరొకరికి చెప్పుకొని మనసుల్ని ప్రక్షాళితం చేసుకొని, గతాన్ని విస్మరించి ఒకరినొకరు అర్థం చేసుకొని, నిర్మలమైన ఒకే మాటా, మనసులతో నూతన జీవితాన్ని ప్రారంభించాలని సుజాత కావాడు పెద్ద లెక్చరు ఇచ్చాడు. తన గతాన్ని చెప్పాడు కనక ఆమె వెనకటి జీవితాన్ని కూడా చెప్పమని వేధించాడు. ఆమె ఏమీ లేదన్నా వినిపించుకోక చిన్నప్పటి సంఘటనలనయినా చెప్పమని పోరాడు.

ఆమె పాపం! ఆ సంగతి అమాయికంగా చెప్పేసింది. ఆమెకు పదేళ్ళ వయసు వచ్చేవరకూ ఆమె పక్క ఇంటి వారబ్బాయి ఆనందరావుతో కలిసి ఆడుకొనేదట. మిగతా సన్నిహితురాళ్ళూ, స్నేహితులూ వారిద్దర్నీ మొగుడూ పెళ్ళా లనేవారట. ఆనందు ఎర్రగా, అందంగా ఉండేవాడట. తామిద్దరూ మొగుడూ పెళ్ళాలనే భావం సుజాతలో నాటుకపోయిందట. ఆ తరవాత అతడు చదువు నిమిత్తం వేరే వూరు వెళ్ళిపోయినా, ఆమెలో అదే భావం ఉండిపోయిందట. జన్మ జన్మలకూ అతనే తన భర్త అవ్వాలని కోరుకొనేదట. అతడు వెళ్ళిపోయిన నాలుగేళ్ళకు సుజాత ఈడేరిందట.

సుజాత పెద్ద మనిషి అయిన తరవాత చిన్ననాటి తన ఆలోచనల్ని తలుచుకొని, తన అజ్ఞానానికి నవ్వుకొనేదట. తన బాల్య చాపల్యం తనకే ఆశ్చర్యంగా ఉంతిదట. కులాలూ, అంతస్తులూ వేరు కావడం వల్ల తమ వివాహం జరిగే ఆస్కారంలేదని తెలిసినతరవా త—"అయ్యో!" అని కూడా అనిపించలేదట. అతన్ని ఆరాధించడం అంతా తెలియని తనంలో తనలో జరిగిందే కాని, పాపం! ఆనందు కా విషయమే తెలియదట.



రీటా

జుట్టు అద్భుతంగా ఉండేటట్టు చేసేది రీటా. దానిలో అటువంటి శక్తి, సువాసనా ఉన్నాయి - శిరోజాలు సహజంగా, చక్కగా పెరగడానికీ, చల్లదనానికీ, దానికదే సాటి

రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి. మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా ఉంటాయి.




# రీటా

నేడే ఒక సీసా కొనండి
ప్రతిచోటా దొరుకును

ఇప్పుడు సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది.

ఇదీ ఆమె చెప్పిన కథ. అది విన్న వెంటనే తాను కోపోద్రిక్తుడయ్యాడు. అశాంతితో అలమటించాడు. చిన్న వయసులోనే అయినా—అలా మరొక పురుషుని అరాధించడం తాను సహించలేకపోయాడు. ఆమె బాల్య దశలోని భావాలకు ఎట్టి విలువా లేదని తెలిసినా, తన అంతర్గతం ఏదో అవ్యక్తమైన ఆవేదనతో మథనపడేది. ఇదొక కారణం.

మరొకటి ఏమిటంటే, రాధిక తన నే విధంగా మరిచిపోలేక పోతూందో, అదే విధంగా సుజాత కూడా ఆనందును మరిచిపోయి ఉండదని, తన దగ్గర అబద్ధ మాడుతూందనీ భావించడమే.

అయితే మాత్రం ఈ మాత్రం దానికే సుజాత ఆత్మహత్య చేసుకోవాలా? చిత్రంగానే ఉంది.

సుజాత వ్రాసిన ఉత్తరంలోని తరువాయి భాగం చదవసాగాడు.

"గతాన్ని మరిచిపోదాం అన్న మీరు నన్ను చిత్రహింసలకు గురి చేశారు..." తిరిగి ఆలోచనలో పడి పోయాడు మూర్తి.

తాను తన సుజాతను చిత్రహింసలపాలు చేశాడా? తానేదో సరదాకు—ఆమెను ఏడ్పించాలని అనేవాడే కాని, ఆమె దానిని అంత సీరియస్‌గా తీసుకొందా? అంత బాధ పడిందా?

వెనుకటి సంఘటనలన్నీ వరుసగా జ్ఞాపకం రాసాగాయి. అతడి మస్తిష్కపు అడుగు పొరలు క్రమంగా విచ్ఛేదమవుతూ వచ్చాయి.

* * * *

ఒక మారు తాను ఆఫీసు నుండి వచ్చేసరికి సుజాత పడుకొని ఉంది.

"అలా ఉన్నావేం?" అని అడిగాడు.

"ఏమీ లేదు. కొంచెం జ్వరంగా ఉంది" అంది.

ఆమె చేయి పట్టుకొని చూచి, "అవును. జ్వరం ఉన్నట్లే ఉంది. డాక్టరు దగ్గరికి వెడదాం పద" అన్నాడు.

"ఈ మాత్రం దానికి డాక్టరెందుకండీ? అదే పోతుంది" అంది.

తాను బట్టలు మార్చుకొని వచ్చి ఆమె పక్కనే కూర్చుని, "కొంపదీసి నీ ఆనందును గూర్చి బెంగ పెట్టుకోలేదు గదా!" అన్నాడు నవ్వుతూ.

ఆమె తన వైపు తీవ్రంగా చూసి, "ఆవేం మాట లండీ? అతనికీ, నాకూ ఎటువంటి సంబంధమూ లేదని ప్రమాణంచేసినా నమ్మరేం? పదేళ్ళ పిల్లకు ప్రేమంటే ఏమి తెలుస్తుంది?" అంది.

తన మనస్తత్వం ఏమిటో కాని అంతలో వదలాలని ఉండేది కాదు. ఇంకా ఇంకా అనాలనిపించేది.

"అంత తెలియకుండానే ప్రేమించావా? ఆటల్లో ప్రణయాలు సాగించినదానివి ప్రేమంటే తెలియదా?"

"ఏవేవో పరిణితి చెందని పరిజ్ఞాన దశలోని వెర్రి మొర్రి వూహలే తప్ప ప్రణయమంటే ఏమిటో ఎలా తెలుస్తుంది? మొగుడూ పెళ్ళాలంటే ఆ వయసులో ఉండే మధుర భావాంకురాలే తప్ప మనసులు ఇచ్చి పుచ్చుకోవడా లేమిటో ఎలా తెలుస్తుంది? అప్పటికి నేనే పరువాలూ సంతరించుకోలేదు. అప్పుడే పూసిన మొగ్గను, వికసించని విజ్ఞానవతిని. అటువంటి చిరుత్రాయంలో—కనుగాయు కనే కలల్లో అర్ధ మేముంటుంది? అవన్నీ శైశవాయువు లేత మనసులోని లేకి ఆలోచనలేనని ఎన్నిసార్లు చెప్పినా నమ్మకపోవడం నా ప్రారబ్ధం!" అంటూ విలపించింది.

సుజాత పుట్టింటికి వెళ్ళి వచ్చిన ప్రతిసారీ, "మీ ఆనందు కనిపించాడా? ఎలా ఉన్నాడు? ఏమన్నాడు?" అని అడగందే ఉండలేక పోయేవాడు.

"అతన్ని నువ్వు మరిచిపోలేక పోతున్నావనీ, విధి వైపరీత్యంవలన తప్పనిసరిగా నాతో కాపురం చేస్తున్నావనీ చెప్పి, కన్నీరు కార్చి ఉంటావు. అవునా?" అనేవాడు.

"నవమన్మథుని వంటి నీ ఆనందుతో అయితే స్వర్గసుఖాల్లో తేలియాడి ఉండేదానవు. నీ కర్మ కొలదీ నా పాలబడి నరకయాతన లనుభవిస్తున్నావు. పాపం! ఏం చేస్తాం? ఏదో విధంగా సర్దుకుపోవాలి మరి!" అనేవాడు.

ఆమె భగవంతునికి నమస్కారం చేసినప్పుడల్లా — "ఈ జన్మకెలాగూ దక్కలేదు. మీరు జన్మలోనయినా నీ ఆనందునే భర్తగా ప్రసాదించమని గట్టిగా దణ్ణం పెట్టుకో" అనేవాడు.

అవును, నిజమే. తాను ఘోరమైన అపరాధమే చేశాడు. తన సుజాత నిప్పులాంటిది. భర్తను మనసారా ప్రేమిస్తున్న ఏ స్త్రీ కూడా భర్త నోటి వెంట వచ్చే అట్టి నిందలను భరించ లేదు. ఆమె నిష్కల్మష హృదయం తనకు తెలుసు. అయినా — ఏమిటో — తనకే తెలియదు—ఆలా హింసించాలని పించేది. ఏదో కసితో ఏదో అనిర్వచనీయమైన ప్రేరణతో ఆమె గుండెను తూట్లు పొడిచేవాడు. ఇప్పుడు ఆలోచిస్తూంటే తా నెంత కర్కశ హృదయుడో, రాక్షసుడో తనకు తెలుస్తూంది. అవును—ఆమె వ్రాసినట్లు అవన్నీ చిత్రహింసలు కాక మరేమిటి?

తిరిగి చేతిలోని కాగితాలపై దృష్టి సారించాడు.

"ఎప్పుడో నేను వ్యక్తిత్వం పుంజుకోని రోజుల్లో అర్థం పర్థం లేని పిచ్చి వూహలుగా జనుకట్టు దగిన నా తలపుల్ని బాల్య చాపల్యాన్ని పదేపదే నా ముందు ఉంచారు. ఒక కమ్మని పసితనపు కలగా మిగిలిపోయే దానికి బలాన్ని ప్రోది చేశారు. ఫలితంగా ఆ వూహలు బలీయమై చెరగని ముద్రలుగా నా హృదయంలో హత్తుకుపోయాయి. చిలిపితలపు అనుకొన్నది ఒక కమనీయమైన చిత్రంగా రూపురేఖలు దిద్దుకొని నా మనసును ఆక్రమించింది.

"అయినా ఆ ప్రభావానికి లోను కాకూడదని శత విధాలా పోరాడాను. మానుపడుతున్న గాయాన్ని మరల లేపేవారు మీరు. న న్నెంత ప్రేమిస్తే మాత్రం సుఖమేముంది? కడివెడు పాలలో ఒక్కొక్క విషపు చుక్కనూ వేస్తూ మొత్తం విష భాండంగా మార్చారు. మళ్ళించుకొంటున్న నా మనసుకు పగ్గాలు వేసి మరల ఆ రూపాన్నే నాకు చూపిస్తూ ఉండేవారు. నా మనసును ఎన్నివేల లక్షల కోట్ల సార్లు చీల్చి, ఖండ ఖండాలుగా ఛేదించారో మీకు వేరే

# పారిజాతం

నందనవన పారిజాత మొకటే చాలు!  
సుందర సుమ సౌరభాల కదే నవాలు!

అన్ని రంగులూ కలిసిన తెల్లని కాంతి!  
అందులోని చిత్రాలే రంగుల భ్రాంతి!  
తెల్లదనం ఒకటి చాలు. రంగులు కరువా?  
దిక్కుల నయనాలు ఇంద్ర ధనువులు కావా?

పూట కొకటి చంద్రకళలు పదహారైనా,  
ప్రతి కళతో కనువిందుగ చంద్రుడొక్కడే!  
గాలి సప్త స్వరాలతో ఈల వేసినా,  
స్వరాలు పలికించునట్టి వేణువు ఒకటే!

మరుగుజ్జుల నడుమ మేరునగమై పెరిగి  
మేటిగ జీవించు మనిషి కోటి కొక్కడే!  
సామాన్యుడి కొకే కొడుకు చాలనుకుంటే,  
శుక్ల పక్ష చంద్రునిలా సుతులు పెరగరా?

\- కలువకొలను సదానంద

సినిమా చదవండి
సుప్రసిద్ధ సినీ - వార పత్రిక

శ్రీకవితా వారి నూతన ప్రచురణలు
ఆంధ్రుల అభిమాన రచయిత్రులు
డా॥ కె.వి. కృష్ణకుమారి, శ్రీమతి విమలారామం అపూర్వరచనలు
మంచుపూలు - డా॥ కె.వి. కృష్ణకుమారి .....12-50
(ఒకేసారి మూడు భాషల్లో వెలువడుతూ పాఠకుల నుద్రూత లూగిస్తున్న ఏకైక నవల)
కలకాలం నిలిచేది - శ్రీమతి విమలారామం..10-50
(కుహన సంస్కారానికి వాస్తవమైన సంస్కారానికి జరుగుతున్న అంతః సంఘర్షణలో ఈ నవల శ్రీమతి విమలారామం అపూర్వసృష్టి)
డాక్టర్ తులసీకృష్ణ - సింహప్రసాద్..........9-00
(జనసుధ పత్రికలో సీరియల్ అయిన మేటి నవల)
మీకు కావలిసిన పుస్తకాల ధర M.O. పంపండి పోస్టేజి ఉచితం.
శ్రీకవితా పబ్లికేషన్స్. మ్యాజియం రోడ్డు, విజయవాడ-2

శుభవార్త



నాడీప్రవీణ దీర్ఘరోగ నిపుణులు
డా॥ ఎస్. ఎస్. రావు, M.B.H., R.M.P.
గారిని సంప్రదించండి.
రావూస్ ప్రోడక్ట్సు & క్లినిక్,
ప్లాట్ నెం. 471, జూబ్లి హిల్స్,
హైదరాబాద్ - 500 034.

శరీర బలహీనత, నూబగా పెరుగుట గాని, చిన్నప్పటినుండి ఏ మందు వలనను లావు కాకపోవుట, అంగములు ఉండవలసిన సైజులో ఉండకపోవుట, నరముల బలహీనత, మానసిక వ్యాధులు, ఫిట్సు, భయం, గుండె దడ, రక్త ప్రసరణ ఎక్కువ గావడం, లేక తక్కువ గావడం, సర్వ విధములగు దగ్గులు, ఉబ్బసం, పొత్తికడుపు ఎత్తుగ పెరగడం, జలోదరం, కడుపునొప్పి, గ్యాస్ట్రిక్ ట్రబుల్స్, లివర్ జబ్బులు, కడుపులో గాలిచేరుట, స్త్రీల ముట్టుకట్టునొప్పి కుసుమ వ్యాధి (ఏ రంగైనా సరే), మూత్ర వ్యాధులు, మూలశంక, సుఖవ్యాధులు, స్త్రీలకు గాని, పురుషులకుగాని ఒకరిపై ఒకరికి విముఖత, పిల్లలు లేక పోవుట, వీపునొప్పి నడుంనొప్పి, కీళ్లవ్యాధులు, వాపు, నీరు చేరుట, చర్మవ్యాధులు, పుండ్లు, ఎక్కడైనా చర్మము దళసరి ఎక్కుట, బోదవాపు, జ్వరము, పక్షవాతం మొదలైన వ్యాధులు దీర్ఘ వ్యాధులుగా పరిణమించినప్పుడు మాత్రమే వీరు చికిత్స చేయుదురు. తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

సంప్రదించు కాలము : ఉ. 7 గంటల నుండి సా. 5 గంటల వరకు
పరీక్ష ఫీజు : రూ. 15/—. చికిత్సకు అదనం.

ప్రతి నెల 25 వ తేదీ నుంచి 4 వ తేదీ వరకు హైదరాబాద్‌లో కోటి, సుల్తాన్‌బజారులోని జియా లాడ్జిలో, (కూరగాయల మార్కెట్టు ఎదురుగా), సంప్రదించ వచ్చును.

ప్రతి నెల క్యాంపులు: 5వ తేదీ కర్నూలు—న్యూ ఉడిపి హోటల్, పెద్ద మార్కెట్‌వద్ద, 6 వ తేదీ గుంటకల్—శ్రీ లాడ్జి, 7 వ తేదీ కడప—ద్వారకా లాడ్జి, 8 వ తేదీ తిరుపతి—భీమాస్ అనెక్స్ లాడ్జి, 9 వ తేదీ : నెల్లూరు—రాఘవ విహార్, 10, 11 తేదీలు : మద్రాసు—కోమల విలాస్, నెం. 5, ఫ్రాన్సిస్ జోసఫ్ స్ట్రీట్ (జి. టి.), హైకోర్టు ఎదురుగా, 13, 14 తేదీలు : వైజాక్—బృందావన్ లాడ్జి, డాబా గార్డెన్సు, 15, 16 తేదీలు : రాజమండ్రి—శాంతినివాస్, మెయిన్‌రోడ్, 17వ తేదీ: విజయవాడ—మోడరన్ కేఫ్ లాడ్జి, (గాంధినగర్), 18 వ తేదీ ఖమ్మం—మయూర్ కేఫ్, (శేషమహల్ లాడ్జి), 19 వ తేదీ: వరంగల్— హోటల్ నటరాజ్, 20వ తేదీ నుండి హెడ్ ఆఫీసు.

N.B. పోస్టు ద్వారా సలహా కోరువారు ఫీజు రూ. 15. జవాబుకు పోస్టు బిళ్లలు పంపవలెను.

Swastik

చెప్పనక్కర లేదు. మీ అనుమానాల అగ్నిజ్వాలల్లో మాడి, మోడువారి పోయిన నా హృదయం ఆనందు మీది ఊహలతో తిరిగి చిగిర్చింది. అతని మీది ఆకర్షణ మరల ఆవిర్భవించింది. చలనం లేని గట్టి రాతి నేల వంటి నా హృదయంలో ఎప్పుడో విత్తుపడి అలాగే ఉండిపోయింది. కాని, కాలక్రమేణా సంఘర్షణలతో దున్నబడి, కన్నీటితో తడిచిన ఆ నేలలో — ఇంత కాలానికి ఆ విత్తు మొలక ఎత్తింది.

నిత్యజీవితంలోని అగ్నిజ్వాలలో ఆహుతవుతున్న తప్పొప్పులకూ, మంచిచెడ్డలకూ అతీతంగా చల్లదనం కోసం ఆనందుతోడి బాల్య స్మృతులను ఆశ్రయించాను.

"యౌవనదశలో మీరూ, రాధికా ప్రేమించుకొంటే లేని తప్పు బాల్యదశలో నేను—ఆనందు మీద వెర్రి ఆశలు పెట్టుకోవడం ఘోరమైన అపరాధమై పోయింది. నా పాతివ్రత్యం మంట గలిసింది. నేను పతితనై పోయాను. ఆడవారి కొక నీతి, మగవారి కొక నీతి ఉంటుందనే సత్యాన్ని బుజువు చేశారు. అతని మీద నా కిప్పుడు ఎటువంటి అభిప్రాయమూ లేదు మొర్రో! అని గీపెడుతున్నా పున్నతమైన మీ మగ సంస్కారం అంగీకరించలేదు. అర్థం లేని అనుమానాలతో అమానుషంగా నన్ను వేధించి, రాచి రంపాన పెట్టారు. నరకలోకం అంటూ వుంటే అదే ఎన్నోరెట్లు మేలు అనిపించారు. లేస్తే తప్పు, కూర్చుంటే తప్పు. ఏడ్చినా తప్పు, నవ్వినా పతప్పే నా ప్రతి చర్యనూ ఆనందుమీది అనురాగానికి అనుసంధించేవారు.

"గత రాత్రి మీ ప్రవర్తనను ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకోండి. నా మనసునూ, సహనాన్నీ ఎంత ధ్వంసం చేశారో మననం చేసుకోండి. మీరనే మాటలు మీకు మామూలు మాటలు గానే తోచవచ్చు. కాని అవి మానసంకల నాకు వాడిశూలాల్లా గుచ్చుకొని గిలగిల్లాడేలా చేస్తున్నాయని ఇదివరలో ఎన్నోసార్లు చెప్పాను. అయినా మీ ధోరణి మీదే. పిల్లి ఎలుకను పట్టుకొని ఒక్కసారిగ చంపకుండా హింసిస్తూ ఆనందిస్తుంది. అలాగే మరి కొన్ని జంతువులు కూడా తమ ఆహారాన్ని కష్టపడి వేటాడి సము పార్జించుకొన్నప్పుడు మాత్రమే అట్టి మనస్తత్వాన్ని చూపుతాయి. కాని, మిమ్మల్ని చూచిన తరవాత మనిషీ కూడా అలాగే హింసిస్తూ అందులోనూ తన ప్రియమైన వారినీ, ప్రాణ సమానమైన వారినీ మానసికంగా హింసిస్తూ, వినోదించడమే చిత్రంగా వుంది. తద్వారా ఆ మనిషి పొందే మానసికోల్లాసానికి కారణం ఎంత వెదికినా కనుపించదు."

'అవును, సుజా! అవును. నేను దుర్మార్గుడిని. హంతకుణ్ణి.' మూర్తి మనసులోనే వ్యథ చెంద సాగాడు.

'పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణ సంకటమని తెలుసుకోలేక పోయిన అవివేకిని. నేను మనిషిని కాదు, సుజా మనిషిని కాదు.' మూర్తి అంతరంగం విలపిల్లింది. సుజాత వ్రాసిన ముందు రాత్రి సంఘటనలను నెమరు వేసుకో సాగాడు.

తాను ఫ్రెండ్సుతో కలిసి సినిమా చూసి, రాత్రి పదిన్నరకు ఇంటికి చేరాడు. తన రాకచూచిన సుజాత లేచి వంట గదిలోనికి వెళ్ళింది. తాను బట్టలు మార్చుకొని వచ్చేసరికి సుజాత అప్పడాలు వేయిస్తూంది.

"ఈ సంగతి విన్నావా, సుజా? పాపం! ఆనంద రావు గుండెపోటుతో చనిపోయాడట!" అన్నాడు ఆమెను సమీపించి, ఓరగా చూస్తూ.

"ఏ ఆనందరావు?" అంటూ ఆశ్చర్యంగా చూచింది.

"ఇంకే ఆనందరావు? నీకు తెలిసిన ఆనందరావు లెంత మంది ఉన్నారేమిటి! నీ చిన్ననాటి నేస్తం, నీ గుండెలో గూడు కట్టుకొన్న నీ ప్రియాతి ప్రియ మైన ఆనందు, మనసార వలచి అతని భార్య కావా లని కలలు కని, విధిలేక నన్ను కట్టుకొన్న దానివి. నీకు ఆనందరావంటే ఎవరో వేరే చెప్పాలా? ఎంత నంగ నాచివి!" ఇలా వేధన కవిత్వం ఒలక బోశాడు తాను. తన ములుకుల్లాంటి మాటల్నీ, చురకత్తుల్లాంటి చూపుల్నీ ఎదుర్కొని నిర్వికారంగా, నిర్మలంగా తన కళ్ళలోనికి చూస్తూ ఉండి పోయింది. ఇక వాదించడం అనవసరమని అనుకొంది కాబోలు, పాపం! కాని కైపెక్కిన తన మనసు దానిని గ్రహించ లేదు.

"అదేమిటి మాట్లాడ కుండా అలా చూస్తూ ఉండిపోయావు? రాజమండ్రీలో హెల్త్ ఇన్ స్పెక్టరుగా పనిచేస్తూ, చెడతాగి గుండె ఆగి చని పోయాడట. వా డలా చనిపోవడం-నిజం చెప్పవద్దూ-నాకు కొంచెం కష్టంగానే ఉంది. వాడొక రోగ్. వాడికి లేని దుర్వ్యసనాలు లేవు. పచ్చి తాగుబోతూ, వ్యభిచారీనూ. వాడు కుళ్ళి కుళ్ళి పురుగులు పట్టి చస్తాడని ఆశిస్తున్న నాకు వాడలా ఏ బాధలూ లేకుండా, ఏ నరకమూ అనుభవించ కుండా హాయి మనడం ఏమంత తృప్తిగాలేదు. మరి నీ కెలా ఉంది?"

విశ్చేష్టురాలై తననే చూస్తూ ఉండి పోయింది. పెనంలోని అప్పడం ఎర్రగా మాడి పోతూంది. నూనె మరిగి ఎగిరెగిరి పడుతూంది.


"ఏమిటా చూపు? ఈ వార్త విన్నంత అచేతను రాలిగా మార్చి వేసిందా? కొంప తీసి మూర్ఛ పోవు గదా! లేక పైకి అలా నాటక మాడు తున్నావా? పాపం! నీకెంత కష్టం వచ్చిందీ! ఊరుకో. విచా రించకు. మరి, పోనీ, అంత బిగబట్టుకోవడ మెందుకు-నేనేమీ అనుకోనులే. ఏడ్చేయి. గట్టిగా ఏడ్చేయి. నీ మనసులోని దుఃఖ మంతా బయటికి వదిలేసి తేలిక పడు. ఏం చేస్తాం మరీ! అంతా విధివిలాసం."

అప్పడాలు ప్లేట్లో వేసి తనకు భోజనం వడ్డిం చడంలో నిమగ్నురాలయింది సుజాత..

"అబ్బెబ్బే! నాకేమీ నచ్చలేదోయ్. ఎవరి నయితే జన్మ జన్మలకూ భర్తగా పొందాలని భగవంతుని ప్రార్థించావో, అట్టి ప్రాణ సమమైన ప్రియుడు చచ్చి పోయాడని తెలిసినప్పుడు—కనీసం రెండు కన్నీటి బొట్లయినా రాల్చక పోవడం మానవత్వమనిపించు కోదోయ్!"

ఎంత కవ్వించినా సుజాత నోరుమెదలేదు.

సుజాత ఉత్తరాన్ని నీరు స్రవిస్తున్న తన కళ్ళ ముందు ఉంచుకొన్నాడు మూర్తి.




"ఈ అగ్నికీలల్లో దగ్ధమయేకన్న ఈ నిత్య శంకితునికి మనసిచ్చి మోసపోయేకన్న, మానవావతార మెత్తిన ఈ క్రూర మృగానికి నచ్చ జెప్పే కన్న నా ప్రేమను ఆ ఆనందుమీదికి మళ్ళించి తచ్ఛాంతి పొందడమే ఉత్తమంగా తోచింది. ఆనందు ఎంత వ్యసన పరుడైనా, ఇంత నీచాతి నీచంగా ఇంత పైశాచికంగా ప్రవర్తించి ఉండడు. ఆనందునే చేసుకొని ఉంటే ఎంతో అదృష్టవంతురాలినయి ఉండేదాన్ని. మీ మాటలూ, కుత్సిత స్వభావాల మూలంగా నా మనసు కలుషితమయి ఆనందు వైపు అర్రులు చాచసాగింది.

"అంతే కాదు. అతని చావు వార్త మీనోటి నుండి విన్న తరవాత కొద్దిరోజులు ఆలస్యంగా నైనా వెళ్ళి అతడిని కలుసుకోవాలనే తపన అధిక మయింది. ఈ నా నిర్ణయానికి అంకురార్పణ జర గకముందు—అంటే నిన్న రాత్రి మీరు ఇంటికి వచ్చేవరకు మీరు మారతారనే ఆశించాను. మీలోని ఈ నికృష్ట భావాన్ని దూరం చేసుకొని, నా నిర్దోషి త్వాన్ని గ్రహించి ఎప్పటి కయినా నన్ను ఆదరించక పోతారా అనే ఆశ నాలో ఉండేది. ఆ ఆశతోనే ఈ పదేళ్ళూ మీతో కాపురం చేశాను. నిత్యం చస్తున్నా, బ్రతుకుతూ మీతో కాపురం చేయ గలిగాను. ఇద్దరు బిడ్డల్ని కని, పెంచి పెద్ద చేయ గలిగాను.

"కాని నిన్నటి రాత్రి—మీ భోజనం అయిన తరవాత కాసేపటికి న న్నాక్రమించుకోబోతే నా ఒంట్లో బాగులేదు, వద్దూ అన్నాను. అప్పుడు మీ రేమన్నారు? 'పోనీ ఈ కాస్సేపూ నన్ను ఆనందే అనుకో' అని నామీద పశువులా పడ్డారు. ఇక దానితో నా సహనం నశించింది. ఆనకట్ట బ్రద్ద లయింది. మీరు మారతారనే ఆశ మృగ్యమయింది. నా ఆశాజ్యోతి అదృశ్య మయింది.

"ప్రతిసారీ ఒక్కో రక్త బిందువు పోస్తున, ఒక్కో ముక్క చొప్పున నాలోని రక్త మాంసాల్ని హరించి అస్థి పంజరంగా మార్చారు. పచ్చని చెట్టు ప్రతీ ఆకునూ తుంచి చివరికి మోడుగా మార్చారు. గత రాత్రి మీ ప్రవృత్తి జీవచ్ఛవం లాంటి నన్ను కట్టెగా మార్చింది.

"అందుకే అంబర వీధుల్లో చేతులు చాపుకొని నా రాక కోసం నిరీక్షిస్తున్న నా ఆనందు బాహు వల్లరిలోనికి సంతోషంగా వెళ్ళి పోతున్నాను. నా చావుకు వే రెవరూ కారణంకాదని పోలీసు వారికి వేరుగా ఉత్తరం వ్రాశాను. నా చావుతోనైనా మానవత్వం సంతరించుకొని, పిల్లల్ని ప్రేమతో పెంచి పెద్ద చేయవలసిందిగా కోరుతున్నాను. ఇదే నా మొదటిదీ, కడసారిదీ అయిన కోర్కె.

—మీదాన్ని కాలేక పోయిన,
సుజాత."

ఉత్తరం ఆసాంతం చదివి, నిర్వీర్యుడై నిశ్చల తపస్సమాధిలోని యోగి పుంగవుడులా నిర్నిమేష దృక్కులతో శూన్యంలోకి చూస్తూ ఉండి పోయాడు మూర్తి. ★

## ఈ చివురాకు నీ ప్రసవం

నిన్న నరికిన కొమ్మలు
శిరసెత్తెను ఎర్రని పువ్వులతో
మొన్న పెరికిన గరికలు
కన్ను తెరిచెను ఆకుపచ్చని నవ్వులతో-
ఎండి బీటలు వారిన
ఇనకలోంచి తరగలెత్తే
నదుల ఎదల సొదలు విను
మోడు వారిన గుండెలోంచి
విరిసే సిరిమల్లె పొదలు చూడు
రేపటి భవితవ్యం
యువతరం చేతులలో
ఎలుండి అతి నవ్యం
నవతరం చేతల్లో!!!

- రామసూరి